# ఎన్నికలు పూర్తయ్యేవరకు నియమావళి అమలు

**-కలెక్టర్ పి.ప్రావీణ్య**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడుదశలుగా నిర్వహించబడుతున్న నేపథ్యంలో, మొదటి దశ పోలింగ్ పూర్తయిన గ్రామపంచాయతీలకు వెంటనే మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసిసి) ఎత్తివేయ బడదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో చివరిదశ ఎన్నికలు పూర్తయ్యేవరకు గ్రామీణ ప్రాంతాలన్నింటిలో ఎంసిసి కొనసాగుతుందని ఆమె స్పష్టంచేశారు. మొదటి, రెండవదశల్లో ఎన్నికైన అభ్యర్థులతోసహా ప్రజలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎంసిసి ఉల్లంఘించినట్లయితే, సంబంధితులపై నిబంధనల ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామన్నారు. తమ పరిధిలోని గ్రామపంచాయతీలలో ప్రజలకు చివరిదశ ఎన్నికలు పూర్తయ్యేవరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని అవగాహన కల్పించాలని రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

# రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

**-చికిత్సపొందుతున్న మరో యువకుడు**

**నంగునూర్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని రాంపూర్‌గ్రామానికి చెందిన ఎనగందుల సాగర్(19) యువకుడు శుక్రవారంరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. అదేగ్రామానికి చెందిన మరో యువకుడు ఎనగందుల విశాల్ తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. సాగర్, విశాల్ ఇద్దరూ ద్విచక్రవాహనంపై నంగునూర్ నుంచి రాంపూర్ వైపు వస్తుండగా మండలపరిషత్ కార్యాలయం సమీపంలో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టారు. దీంతో తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే బాధితులను నంగునూర్‌లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం సిద్దిపేటలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్సపొందుతూ సాగర్ మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

# అవినీతిరహిత సమాజానికి కృషిచేద్దాం

**-జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**




పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
అవినీతిరహిత సమాజానికి అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. శనివారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేటులోని తనచాంబర్లో అవినీతి నిర్మూలనపై అవగాహన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అవినీతి తీవ్రమైన నేరమని, ప్రజలు ఎట్టిపరిస్థితుల్లోనూ లంచం ఇవ్వకూడదని అన్నారు. లంచం తీసుకోవడం నేరమని అన్నారు. ప్రజలు ధైర్యంగా అవినీతిపై నిలదీయాలని సూచించారు. ఎవరైనా అవినీతిఘటనలను గమనించిన వెంటనే 1064 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని కోరారు. అవినీతిరహిత పాలనకు ప్రజలసహకారం అవసరమన్నారు. ప్రతిపౌరుడు తమవంతు బాధ్యతగా సమాజంలో పారదర్శకతకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో అవినీతి నివారణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని, ఫిర్యాదుచేసినవారి వివరాలు రహస్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అవినీతినిరోధకశాఖ అధికారులు డిఎస్‌పి కె.సుదర్శన్, ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఖాతా, సంతోష్‌నగర్ సర్పంచ్‌ల ఎన్నిక ఏకగ్రీవం

**-7వార్డులకు అభ్యర్థుల ఏకగ్రీవమే**



సర్పంచ్‌లను సత్కరించి, అభినందిస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**నంగునూర్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
మండలంలోని ఖాతాగ్రామ సర్పంచ్‌పదవితోపాటు ఏడువార్డులకు వార్డుసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్‌పదవికి అదేగ్రామానికిచెందిన పుల్లూరి రజిత, పుల్లూరి రేణుక, పుల్లూరి సోని నామినేషన్ దాఖలుచేశారు. వీరిలో పుల్లూరి రజిత, పుల్లూరి రేణుక తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో పుల్లూరి సోని ఒక్కరే బరిలో మిగలడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. 7వ వార్డుకు ఈనెల 14న ఎన్నిక జరగనుంది. మండల పరిధిలోని సంతోష్‌నగర్ సర్పంచ్ పదవి సైతం ఏకగ్రీవం అయింది. సర్పంచ్ పదవికి బానోతు భాస్కర్ తన నామినేషన్ ఉపసంహరించుకోవడంతో బానోతు సరోజ ఎన్నిక ఏకగ్రీవం అయింది. గ్రామంలో మొదటివార్డు అభ్యర్థి వెంకటేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 5 వార్డులకు ఈనెల14న పోలింగ్ జరగనుంది. సిద్దన్నపేటలో రెండువార్డులు ఏకగ్రీవం అయినాయి. ఎన్నికైన సర్పంచ్‌లను, వార్డుసభ్యులను జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తన క్యాంపు కార్యాలయంలో అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

# టిఎస్‌ఎపిపి పరీక్షను వాయిదా వేయండి

**-పరీక్ష వల్ల ఓటు హక్కును కోల్పోవాల్సి వస్తుంది**

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
ఈనెల 14వ తేదీన నిర్వహించబోయే తెలంగాణ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (టిఎస్‌ఎపిపి) పరీక్షను వాయిదావేయాలని హుస్నాబాద్ నియోజకవర్గ న్యాయవాదులు ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం విడుదలచేసిన ప్రకటనలో డిసెంబరు 14వతేదీన గ్రామపంచాయతీ రెండోదశ ఎన్నికలు ఉన్నాయని, ఈపరీక్షకుహాజరయ్యే అభ్యర్థుల్లో సగంమంది గ్రామీణప్రాంతాలకు చెందిన వారేనని, న్యాయవాదుల ఆధ్వర్యంలో అనేక వినతిపత్రాలు టిజిపిఎల్‌ఆర్‌బి సమర్పించగా తెలంగాణ హైకోర్టున్యాయమూర్తి పుల్ల కార్తీక్ బెంచ్ వాటిని పరిగణనలోకితీసుకోవాలని టిజిపిఎల్‌ఆర్‌బికు సూచించిందని, అయినా టిజిపిఎల్‌ఆర్‌బి 14 డిసెంబరు రోజే పరీక్ష నిర్వహించేందుకు శనివారం హాల్‌టికెట్లను విడుదలచేసిందని, పరీక్షాకేంద్రాలు అభ్యర్థుల జిల్లా ప్రధాన కార్యాలయాల్లో కూడా లేకుండా, ఎక్కువగా హైదరాబాద్‌లాంటి దూరప్రాంతాల్లో ఉండటంతో, పరీక్ష తర్వాత తమ గ్రామాలకు వెళ్లి ఓటువేయడం సాధ్యంకాదని, నిర్వహించే పరీక్ష సమయం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు రెండుపేపర్లతో ఉన్నాయని, కావున తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో సమస్యలు ఎదురవకుండా కొంతమంది న్యాయవాదులే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీదారులుగా ఉన్నారన్నారు. తద్వారా వారికి తీవ్రమైన ఇబ్బంది కలిగే అవకాశం ఉందన్నారు. ఈ ఎన్నికల కారణంగానే జరగాల్సిన పంచాయతీ టిఎస్‌సెట్ పరీక్షను ఉస్మానియా యూనివర్సిటీ వాయిదావేసిందని, కోర్టులో 14వతేదీన జరగాల్సిన లోక్ అదాలత్ కార్యక్రమాలు కూడా వాయిదా పడ్డాయని కావున ఈపరీక్షను కూడా వాయిదావేసి తమకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని వారు డిమాండ్‌చేశారు.

# రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవు

**-ట్రాఫిక్ సిఐ మురళి**



ఫుట్‌పాత్‌పై పెట్టిన సామాన్లను తీయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణంలోని ప్రధాన రోడ్లలో వ్యాపారాలు చేసుకునేవారు, దుకాణదారులు రోడ్డును, ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలుచేస్తే చర్యలుతప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కునుండి ఢిల్లీవాలా హోటల్‌వరకు రోడ్డుకు ఇరువైపులా రోడ్డుపై, ఫుట్‌పాత్‌లపై పెట్టిన సామగ్రిని తీసివేయించడంతోపాటు వ్యాపారస్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సిఐ మురళి మాట్లాడుతూ పట్టణంలోని ప్రధానరోడ్లలో ఉన్న వ్యాపారస్థులు సామగ్రిని, ఫ్లెక్సీ బోర్డులను రోడ్డుపై, ఫుట్‌పాత్‌లపై పెట్టడంవల్ల వాహనదారులకు, నడుచుకుంటూవెళ్లే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. వ్యాపారస్థులు ట్రాఫిక్, రోడ్డు, మున్సిపల్ నిబంధనలు పాటించి వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ జగదీశ్వర్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిలిపిచెడ్ మండలంలో అక్రమ మద్యం పట్టివేత...

**చిలిపిచెడ్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
చిలిపిచెడ్ మండలంలో పోలీసులు పలు కిరాణాషాపుల్లో దాడులు నిర్వహించగా జయరామ్ తండాలోని బర్మావత్ బద్య అనే వ్యక్తి షాపులో 6.12లీటర్ల మద్యం సీసాలను స్వాధీనపరుచుకున్నట్లు ఎస్సై నర్సింహులు తెలిపారు. ఎన్నికల కోడ్ నియమావళిని అనుసరించి ఎవరైనా అక్రమ మద్యం నిల్వలు, విక్రయాలు చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దుకాణ యజమానిపై కేసు నమోదుచేసి విచారణ కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా కార్యకలాపాలు కొనసాగిస్తే కఠినంగా శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం తగదు

**-ఓటుహక్కును వినియోగించుకొని మంచి నాయకుడిని ఎన్నుకోవాలి**
**-మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బలవంతంగా వేలంపాటలు పాడుతూ ఏకగ్రీవాలు చేస్తూ భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం సరికాదని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని అభివృద్ధిని చేసే మంచి నాయకుడిని ఎన్నుకోవాలని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకు అందిస్తుందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కన్న కలలను కాలరాయకుండా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా జరిగే పంచాయతీ ఎన్నికల్లో గ్రామాలను అభివృద్ధి చేసే కొత్త తరానికి నాంది పలకాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో పాటు ఎన్ఆర్ఈజిఎస్ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి తప్ప, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు శూన్యమన్నారు. తాను ఎంపిగా గెలిచిన తర్వాత మొదటి ఆర్థిక సంవత్సరంలో 65 శాతం నిధులు జిల్లాలోని అభివృద్ధి పనులకు కేటాయించాని గుర్తు చేశారు. జిల్లాలో ఎక్కడ అభివృద్ధి పనులు నిలిచిపోయాయో, అక్కడ పనులు పూర్తి చేయడానికి నిధులు ఇచ్చానని తెలిపారు. బిజెపికి అనుబంధంగా బరిలోకి దిగిన అభ్యర్థులను గెలిపిస్తే రూ.25లక్షల నిధులు కేటాయిస్తానని పేర్కొన్నారు. గల్లీలో ఢిల్లీలో అధికారం లేనివారు తామే రైల్వేస్టేషన్లు మంజూరు చేయించామని గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. ఢిల్లీ నుంచి రైల్వేస్టేషన్లు తాము మంజూరు చేయిస్తామని కొందరు, తామే మంజూరు చేయించామని కొందరు క్షీరాభిషేకాలు చేయించుకుంటున్నారని విమర్శించారు. జిల్లాలో ముగ్గురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉంటే ఒక్కరూ ఫాం హౌస్ నుంచి బయటకురారని ఎప్పుడో ఒక్కసారి బ్రేక్ దర్శనంలా ముందుకు వచ్చి ప్రజలకు దర్శనమిస్తారని పరోక్షంగా మాజీ సిఎం కెసిఆర్‌ను విమర్శించారు. మరో ఎమ్మెల్యే హైదారాబాద్‌లో వ్యాపారాలకే పరిమితమైతే ఇంకో ఎమ్మెల్యే రోజూ పేపర్లల్లో ఫోటో కనబడకపోతే జీర్ణించుకోలేరని విమర్శించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కేంద్ర సర్కార్‌తోనే సాధ్యమవుతుందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో పాత తరాన్ని పక్కనబెట్టి కొత్త తరానికి తెరలేపాలన్నారు. సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్‌ముదిరాజ్, నాయకులు వంగ రామచంద్రారెడ్డి, చింత సంతోష్, బాసంగారి వెంకట్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపి రఘునందన్‌రావు

# వలస ఓటర్లపైనే స్థానిక అభ్యర్థుల ఫోకస్..!

**-యోగక్షేమాలతో పలకరింపులు..!!**
**-ఆప్యాయత కుమ్మరిస్తున్న పోటీదారులు**
**-పలకరింపులతో ఆశ్చర్యపోతున్న ఓటర్లు**



**టేక్మాల్, డిసెంబరు 6 ప్రభాతవార్త:**
గతంలో ఊరికి వస్తే కనీసం పలకరించనివారు, ఫంక్షన్లకు ఆహ్వానించనివారు పంచాయతీ ఎన్నికల పుణ్యమా అని ఆప్యాయతలు, బంధుత్వాలు కలుపుకొని ఫోన్లచేస్తూ హడావిడి చేస్తున్నారు. టేక్మాల్ మండలంలో 29 గ్రామపంచాయతీలున్నాయి. అందులో 4 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమైన విషయం తెల్సిందే. ఉపాధి కోసం ఊరు విడిచి వెళ్లిన ఓటర్ల వివరాలను ఆరాతీస్తూ ఎనలేని ప్రేమ ఒలకబోస్తున్నారు. ఎలాగైనా ఊరికివచ్చి తనకు ఓటు వేసిపోవాలని, రవాణా సదుపాయం కల్పిస్తామని హామీ ఇస్తున్నారు. గెలుపుకోసం శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎన్నడూలేని ముచ్చట్లతో ఓటర్లు ఇదేంటని ముక్కున వేలేసుకుంటున్నారు. మొదటివిడత నామినేషన్ల ఉపసంహరణపర్వం ముగియడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు గెలుపుకోసం తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు. ఉన్నతచదువులకోసం, కుటుంబ అవసరాలకోసం ఇతరప్రాంతాలకు, జిల్లాకేంద్రాలకు వెళ్లి అక్కడే ఉంటున్నవారికి అభ్యర్థులు ఫోన్‌చేసి పలకరిస్తున్నారు. గ్రామానికి వచ్చి తమకు ఓటువేయాలని వేడుకుంటున్నారు. జిల్లా కేంద్రంతోపాటు ఇతర. పట్టణ ప్రాంతాల్లో వివిధ పనులు చేసుకుంటున్న వారికి ఇప్పుడు ఏఫోన్ చూసినా ఎన్నికల గురించే చర్చ జరుగుతోంది. గతంలో ఎప్పుడు పలకరించనివారు సైతం సర్పంచ్, వార్డుస్థానాలకు ఎన్నికల్లో తమకు ఓటువేయాలని కోరుతున్నారు. పోలింగ్ రోజు స్వగ్రామానికి రావాలని అవసరమైన రవాణాఖర్చులు కూడా తామే భరిస్తామని ఓటర్లకు హామీలు ఇస్తున్నారు. గ్రామాల్లో ఉన్న ఓటరు జాబితా ప్రకారం పట్టణాల్లో స్థిరపడినవారిని కలుస్తున్నారు. వీలుకాకపోతే ఫోన్లద్వారా మాట్లాడుతున్నారు. పట్టణాల్లో స్థిరపడ్డ వేలాదిమంది గ్రామీణ ఓటర్లు హైదరాబాద్, సంగారెడ్డి, తదితర ప్రాంతాలతోపాటు అనేకమంది వలసవెళ్లి అక్కడ జీవనం కొనసాగిస్తున్నారు. హైదరాబాద్ తదితర నగరాలలోసైతం మండలానికిచెందినవారు ఎంతోమంది ఆయాకంపెనీలలో ఉపాధికోసం ఆయా ఉద్యోగాలు చేస్తున్నారు. కొంతమంది. రోజువారి వేతనాల కోసం మరికొంతమంది వ్యాపారాల కోసం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారు సొంత గ్రామాల్లో ఓటుహక్కు పొంది ఉన్నారు. దీంతో రాబోయే సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికల కోసం పోటీలో ఉన్న అభ్యర్థులు సుదూర ప్రాంతాల్లో ఉన్న వలస ఓటర్లకోసం ప్రత్యేకంగా ఫోన్లుచేస్తూ మాట్లాడుతున్నారు. సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికల్లో ప్రతి ఓటు గెలుపోటములను నిర్ణయించే అవకాశాలు ఉన్నందున ఓటునుకూడా వృథాచేయవద్దనే ఉద్దేశంతో అభ్యర్థులు ఓటు కలిగి ఉన్నవారికి ఫోన్లు చేసి ఆప్యాయంగా ప్రేమతో పలకరిస్తున్నారు. ఓటర్ల బ్యాంకు ఖాతాలు లేదా ఫోన్‌పే, గూగుల్‌పే నంబర్లను తీసుకుని వారికి రవాణాఖర్చులు కూడా అకౌంట్లలో వేస్తున్నారు. విందులుసైతం ఇచ్చేందుకు అభ్యర్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. తమకే ఓటు వేయాలని మాటకూడా తీసుకుంటున్నారు. హైదరాబాద్, ఇతర ముఖ్యపట్టణాలలో ఉద్యోగాలు చేస్తున్న వారంతా ఓట్ల కోసం గ్రామాలకు వెళ్లి కుటుంబ సభ్యులతో గడపవచ్చనే ఆలోచనచేస్తూ పోలింగ్‌రోజు సొంత ఊరికి వచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

పంచాయతీ ఎన్నికల్లో సోషల్ మీడియా కీలకపాత్ర పోషిస్తోంది. ఎక్కడో ఉన్న ఓటర్లను అభ్యర్థులు ప్రత్యక్షంగా కలుసుకోలేకపోయినా, వాట్సాప్ ద్వారా తమ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఫోన్లలో బ్రాడ్‌కాస్ట్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని ప్రత్యేకంగా ఓటర్లకు సందేశాలను పంపుతున్నారు. అభ్యర్థులు తాముగెలిస్తే ఏంచేస్తామో వివరిస్తూ సిద్ధంచేసుకున్న ఎన్నికల ప్రచార చిత్రాలను వాట్సాప్‌ద్వారా పంపుతున్నారు. ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. తాము సర్పంచ్‌లుగా గెలిస్తే ఏవిధంగా అభివృద్ధిచేస్తామో వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. గుట్టుచప్పుడుకాకుండా విందులు, వినోదాలకు ఆన్‌లైన్ పేమెంట్లుచేస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేపనిలో ఉన్నారు. గ్రామాల్లో జరుగుతున్న పంచాయతీ ఎన్నికలు ఓటర్లకు పండగలా మారాయి. అలిగితే చాలు, అభ్యర్థులు క్షణాల్లో వారికి కావాల్సినవన్నీ చేస్తున్నారు. నామినేషన్ల ఘట్టం ముగియడంతో అభ్యర్థులు ప్రచారంలో బిజీగా ఉంటూ, ఓటర్లను ప్రసన్నం చేసుకునే క్రమంలో అన్నిదారులు తమవైపునకు ఉండేలా శక్తివంచన లేకుండా చూసుకుంటున్నారు.

# అధికారులు పోలింగ్ స్టేషన్లలో అన్ని సౌకర్యాలు కల్పించాలి

**-జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిపేందుకు అధికారులు పోలింగ్ స్టేషన్లలో అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి ఆదేశించారు. జిల్లాలోని మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే మండలాలలోని పలు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. దౌల్తాబాద్ మండలంలోని దొమ్మాట ప్రాథమిక పాఠశాల, సూరంపల్లి మండల పరిషత్ పాఠశాల, దౌల్తాబాద్ మండల కేంద్రంలోని జడ్పి స్కూల్, ఇందుప్రియాల్ జడ్పి స్కూల్, తిరుమలాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. రాయపోల్ మండల పరిధిలోని రాయపోల్ జడ్పి స్కూల్, అనాజిపూర్ జడ్పి స్కూల్, మంతూరులోని మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం విద్యుత్ సరఫరా, లైట్స్, ఫ్యాన్స్, ర్యాంపు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ పెట్టేందుకు సౌకర్యంగా ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎంపిడివోలను ఆదేశించారు.

అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలలో పాఠశాలలోని విద్యార్థులను కలెక్టర్ హైమావతి ఆప్యాయంగా పలకరించారు. పిల్లలతో తెలుగు పద్యాలు చదివించారు.



క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి

# 100 శాతం ఓటింగ్ దిశగా ప్రజలు ఎన్నికల్లో పాల్గొనాలి..

**-ఎన్నికల నియమాలని ఉల్లంఘిస్తే చర్యలు..**
**-జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**



ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**పాపన్నపేట, డిసెంబర్ 6, ప్రభాతవార్త :**
నూరుశాతం ఓటింగ్ దిశగా ప్రజలు ఎన్నికల్లో పాల్గొనాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపునిచ్చారు. శనివారం పాపన్నపేట మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికలసామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ, జిల్లాలో మొదటి ఫేజ్ ఎన్నికలకోసం నామినేషన్ పూర్తయిందని, ఆయాగ్రామాల్లో క్యాంపేన్ నడుస్తుందన్నారు. మొదటి ఫేజ్ ఎన్నికలకోసం డిసెంబరు 11న పోలింగ్ ఉన్నందున ముందురోజున ఎన్నికల సిబ్బంది తమతమ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. మొదటి విడతలో ఆరు మండలాలో జరగనున్న సర్పంచ్, వార్డుసభ్యులకు జరిగే ఎన్నికలు అత్యంత పారదర్శకంగా జరగాలని తెలిపారు. మొదటి ఫేజ్‌లో 14 గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల, ఉపసర్పంచ్ ఎన్నిక పూర్తయినా కూడా ఆయాగ్రామాల్లో ఎన్నికల నియమావళి కొనసాగుతుందన్నారు. ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి ఫిర్యాదులు అందినా ఫ్లైయింగ్ స్క్వాడ్ టీములు దర్యాప్తు చేసి ఎన్నికలనియమాల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఎన్నికలు జరుగుతున్న గ్రామాల్లో ఎన్నికలనియమాలు పాటించి నిబంధన మేరకే ప్రచారం చేయాలన్నారు. గ్రామాల్లో వంద శాతం ఓటింగ్ జరిగిన గ్రామపంచాయతీలను సన్మానించి, ప్రత్యేక బహుమతులు అందిస్తామని తెలియజేశారు. డబ్బు, మద్యంలాంటి ప్రలోభాలకు గురికాకుండా గ్రామ, వార్డు అభివృద్ధికి ఎవరైతే తోడ్పడేవారిని నిజమైన సర్పంచ్‌గా, వార్డు సభ్యులుగా ఎన్నుకోవాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు సిబ్బంది ఉన్నారు.

**స్పెషల్ క్లాస్‌ను పరిశీలించిన కలెక్టర్...**
పాపన్నపేట ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవతరగతి ప్రత్యేకతరగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా పదవతరగతి విద్యార్థిని విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. విద్యార్థులు కలెక్టర్ రాహుల్‌రాజ్ అడిగిన ప్రశ్నలకు చక్కని సమాధానాలు ఇవ్వడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

## ఉద్యోగులు విధి నిర్వాహణతో పాటు క్రీడారంగాల్లో ప్రతిభకనబర్చాలి : సిఈఓ అరవింద్



సికింద్రాబాద్ పోలో గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్స్‌ను ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ బోర్డు సిఈఓ అరవింద్ ద్వివేది

**కంటోన్మెంట్,డిసెంబర్ 6 ప్రభాతవార్త:** నిత్యం కంటోన్మెంట్ బోర్డు ప్రజలకు సేవలు చేయడంతో పాటు అప్పుడప్పుడు బోర్డు ఉద్యోగులంతా ఉల్లాసంగా ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమని బోర్డు సిఈఓ అరవింద్ కుమార్ ద్వివేది తెలిపారు. శనివారం సికింద్రాబాద్ జింఖానా పోలో గ్రౌండ్‌లో వివిధవిభాగాల్లో పనిచేస్తున్న బోర్డు ఉద్యోగులకు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఈఓ మాట్లాడుతూ ప్రతి రోజు తమ విధి నిర్వాహనలో ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడంతో పాటు తమ కుటుంబ సభ్యులకు,బంధువులకు సమయం కెటాయించడం సహజమేనన్నారు. కొన్ని సందర్భాల్లో ఉద్యోగులంతా కలిసి క్రీడా పోటీలు నిర్వహించుకుంటే ప్రతి ఒక్కరిపై ప్రేమ,ఉత్సాహం కలుగడంతో పాటు ఇలాంటి టోర్నమెంట్స్ భవిష్యత్తులో జ్ఞాపకాలు ఉంటాయన్నారు. కంటోన్మెంట్ బోర్డులోని ఇంజనీరింగ్, శానిటేషన్, అడ్మినిస్ట్రేషన్, వాటర్ విభాగాల ఉద్యోగులు నాలుగు జట్లుగా ఏర్పాటు చేసుకొని క్రికెట్ టోర్నమెంట్స్‌ను నిర్వహించారు. క్రికెట్ టోర్నమెంట్స్‌ను ప్రారంభించడంతో పాటు సిఈఓ అరవింద్ కుమార్ ద్వివేది క్రీడా పోటీల్లో పాల్గొనడంతో ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు.

## అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న హన్మంత్‌రెడ్డి

**నిజాంపేట్, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం 125 డివిజన్ గాజులరామారం పరిధిలోని సుభాష్ చంద్ర బోస్ నగర్ -బికి చెందిన బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలు మహమ్మద్ హనీఫ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ఆదేవింధంగా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తూ వస్తుందని తెలిపారు. ప్రతి తెల్ల కార్డుదారునికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు. ప్రభ్నుత్వ ప్రతిషాత్మకంగా చేపడుతున్న రేషన్ కార్డుల పంపిణీ, ఏ ప్రభుత్వం చేయని పనిని ప్రజా ప్రభుత్వం పేద ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. కాలనీ సంక్షేమ అభివృద్ధిలో తాను ఎల్లప్పుడు ముందు ఉంటానని తెలియచేసారు. నవీన్ గౌడ్, కృష్ణ గౌడ్, ప్రభు గౌడ్, ప్రశాంత్ కుమార్, మహమ్మద్ జైబుయిన్, విష్ణువర్ధన్, ఎల్లయ్య, రాములు, వెంకటయ్య, మధుసూదన్ గౌడ్, ప్రభావతి, వెంకటమ్మ, హోలీ బేగం, నాగరాణి, అరుణ, లావణ్య, రాణి, పద్మమ్మ, యాదమ్మ, వనితలు పార్టీలో చేరారు.

## అభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



సిసి రోడ్లు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**అల్వాల్, డిసెంబరు 6 ప్రభాతవార్త:** రాజకీయాలకు అతీతంగా జరిగే అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. శనివారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని మానస సరోవర్, ప్రకాష్ నగర్‌లులో 19లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని మర్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, డోలి రమేష్, సయ్యద్ మోసిన్, ప్రభాకర్, జనార్ధన్, మురళి గౌడ్ పాల్గొన్నారు.

## భారతీయ ప్రాచీన వైద్య విధానాలకు పూర్వవైభవం తధ్యం : ఆలే శ్యామ్ కుమార్



క్లీనిక్‌ని ప్రారంభిస్తున్న శ్యామ్ కుమార్

**గచ్చిబౌలి, డిసెంబర్ 6, ప్రభాతవార్త;**

భారత్‌లో ప్రాచీన వైద్య విధానాలకు తిరిగి ఆదరణ లభిస్తుండటం శుభ సూచకమని అఖిల భారత ధర్మ జాగరణ సహ ప్రముఖ్ ఆలే శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. కొండాపూర్ రాజరాజేశ్వర నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయుఃవృద్ధి హోమియో పతిక్ అండ్ వెల్‌నెస్ క్లీనిక్‌ని ఆయన లాంఛనంగా ప్రారంభించి, సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయుఃవృద్ధి వ్యవస్థాపకురాలు డాక్టర్ సింధు బైరవి, ఫైనాన్స్ డైరెక్టర్ మనోహరి, మ్యూజిక్ థెరపిస్ట్ వశిష్ట రామ్, సలహాదారులు చింతకింది గోవర్ధన్ గౌడ్‌లను ఆలె శ్యామ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. శేరిలింగంపల్లి ప్రాంత వాసులకు అధునాతన హోమియోపతి సేవలతో పాటు న్యూట్రిషనల్, యోగ, మ్యూజిక్ థెరపిలను అందుబాటులోకి తీసుకురావడం ఆహ్వానించదగ్గ విషయమని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఒకవేళ అనారోగ్యం బారిన పడినప్పుడు ప్రాథమిక దశలోనే ఆయుర్వేదం, హోమియోపతి లాంటి సాంప్రదాయ వైద్యాన్ని ఎంచుకోవాలని సూచించారు.వెల్‌నెస్ సెంటర్ లోని వివిధ విభాగాలను అతిథులుగా విచ్చేసిన రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ నందకుమార్ యాదవ్, ఎస్‌బిఐ రిటైర్డ్ ఏజీఎం బాల్ద అశోక్, యోగా శిక్షకులు, సీనియర్ జర్నలిస్ట్ పుట్ట వినయ్ కుమార్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త రాఘవేంద్రరావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజా, సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు హోమియో వైద్య ప్రియలు పాల్గొన్నారు.



బోయిన్‌పల్లి చౌరస్తాలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు



బోయిన్‌పల్లి మార్కెట్ వద్ద అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఛైర్మన్ ఆనంద్ బాబు, కార్యదర్శి వెంకన్న తదితరులు



తుకారాంగేట్‌లో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కార్పోరేటర్ లింగాని ప్రసన్న



కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



కెపిహెచ్‌బిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన బండి రమేష్



అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న రంగరాయ ప్రసాద్



బిఆర్ అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న త్రికాల మనోజ్ కుమార్, తదితరులు.



బేగంపేట ఫతేనగర్ లింక్ రోడ్డు వద్ద అంబేద్కర్ కు నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి.



అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న కార్పోరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్.



రహమత్‌నగర్ చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న జూబ్లీహిల్స్ శాసనసభ్యులు నవీన్ యాదవ్.



కళ్యాణ్‌నగర్ వెంచర్3 చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ ఏఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి.



బన్సీలాల్ పేట లోని జబ్బార్ కాంప్లెక్స్ వద్ద అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్



మోహన్‌నగర్ బస్తీలో ఎ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నేతలు



బోయిన్పల్లి డాక్టర్ బీఆర్ అంబెద్కర్ వెజిటేబుల్ మార్కెట్ వద్దనున్న అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న నేతలు



లాలాపేట్‌లో బిజెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ వర్ధంతి వేడుకల్లో బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు



మహాత్మాజ్యోతిరావు పూలే ఆధ్వర్యంలో పురానాపూల్ చౌరస్తా వద్ద ఏర్పాటు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం



బండ్లగూడ జాగీర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి,కాంగ్రెస్ నాయకులు.



బిజెపి అడిక్ మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్ స్థానిక కట్టంబావి బస్తీ లోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన దృశ్యం



డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర క్రిస్టియన్ కమిషన్ ఛైర్మన్ దీపక్ జాన్,బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్,చార్మినార్ కాంగ్రెస్ ఇంఛార్జి ముజీబుల్లా షరీప్,యాకుత్‌పుర కాంగ్రెస్ ఇంఛార్జి కె.రవిరాజ్,కాంగ్రెస్ నాయకులు



కిషన్‌బాగ్‌లో భారత రత్న డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బహదూర్‌పురనియోజకవర్గం బిఆర్ఎస్ యువత అధ్యక్షులు సాయి కిరణ్,ఎస్‌సిఆర్‌పి సొసైటీ ప్రతినిధులు సంతోష్,నర్సింహ్మా, బిఆర్ఎస్ నాయకులు హమీద్,సాబుద్దీన్ తదితరులు

# అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగనర్ మహనీయుల చౌరస్తాలో జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్ధండ వెంకటేష్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు.



జూబ్లీహిల్స్ డివిజన్ మహనీయుల కూడలిలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ నేతలు బోజిరెడ్డి, ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు నివాళులు అర్పించారు.

## క్రిస్టియన్ స్మశాన వాటిక ప్రహారీ త్వరగా నిర్మించాలి

**సికింద్రాబాద్, నవంబర్ 6 ప్రభాతవార్తః**

బోయిగూడ క్రిస్టియన్ స్మశానం వాటిక వద్ద నిర్మిస్తున్న ప్రహారీ గోడ పనులను క్రిస్మస్ పండుగ నాటికీ పూర్తి చేయాలనీ బీఆర్ఎస్ పార్టీ పద్మారావు నగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్ తెలిపారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, ట్రాఫిక్ పోలీస్, లా అండ్ ఆర్డర్ పోలీస్, టీ స్టెప్ అధికారులతో కలిసి స్మశాన వాటిక వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఏసీడీపీ నిధుల నుండి దాదాపు 1.08కోట్ల రూపాయలను ఈ ప్రహరీ గోడ, బాత్రూంల నిర్మాణాననికి తలసాని శ్రీనివాస్ యాదవ్ నిధులు కేటాయించారు. ఈ ప్రహరీ గోడ బోయిగూడ ప్రధాన దారి నుంచి ఉండడంతో పనులు జరిగే సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయిని, కాబట్టి రాత్రి సమయంలో జేసీబీ సహాయంతో పనులను త్వరగా పూర్తి చేయాలనీ చిలకలగూడ ట్రాఫిక్ ఏసీపీ జగన్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ప్రహరీ మూల వద్ద ట్రాఫిక్ కు ఇబ్బందులు వస్తున్నాయని కాబట్టి



అధికారులతో సమావేశమైన గుర్రం పవన్‌కుమార్ గౌడ్

కొద్దీ గా వెనక్కి జరిగి ప్రహరీ నిర్మించాలన్న పోలీసుల విజ్ఞప్తికి కమిటీ అధ్యక్షులు జయరాజ్ కూడా అంగీకారం తెలిపారు. ట్రాఫిక్ కు ఇబ్బందులు కలగకుండాప్రహరీ గోడ నిర్మాణానికి అంగీకరించిన జయరాజ్‌ను ట్రాఫిక్ సీఐ జగన్ రెడ్డి, చిలకలగూడ డీఐ మోహన్‌బాబులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమం టీ స్టెప్ అధికారి అఖిల్, ఎస్ఐ రవికుమార్, ఏసురి మహేష్, శ్రీకాంత్ రెడ్డి, మహేందర్ గౌడ్ సుధాకర్ రెడ్డి, శ్రీరాములు, రవి హరి చారి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ



రాంచంద్ బాలికల ఉన్నత పాఠశాలలో నోటుపుస్తకాలను పంపిణి చేసిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 6 (ప్రభాతవార్త ) :**

ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలోని శ్రీ రాంచంద్ బాలికల ఉన్నత పాఠశాలలో రాం దూర్వాసుల ఆధ్వర్యంలో పిల్లలకు నోటుపుస్తకాలను పంపిణి చేసారు. వీటితో పాటు తినుబండారాలు, సానిటరీ న్యాప్కిన్స్ పంపిణి చేసారు. తాను ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించానని,ఎక్కడ చదివాను అనేది ముఖ్యంకాదని బాగా చదువుకుని చిన్నారులందరు ఉన్నత స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యారాణి, పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు సుప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వంశీ రామరాజును పరామర్శించిన మండలి బుద్ధప్రసాద్



ప్రముఖ రచయిత్రి, తెలుగు అకాడమీ పూర్వ ఉప ఏపీ శాసనసభ ;పూర్వ డిప్యూటీ స్పీకర్, అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ సంచాలకులు డా. తెన్నేటి సుధా దేవి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న

**చిక్కడపల్లి డిసెంబర్ 6 ప్రభాతవార్త :** ప్రముఖ రచయిత్రి, తెలుగు అకాడమీ పూర్వ ఉప సంచాలకులు డా. తెన్నేటి సుధా దేవి మరణం సాహితీలోకానికి తీరని లోటని ఏపీ శాసనసభ ;పూర్వ డిప్యూటీ స్పీకర్, అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం నల్లకుంటలో ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన కళాబ్రహ్మ శిరోమణి డా. వంశీ రామరాజు సతీమణి తెన్నేటి సుధాదేవిని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉత్తమ రచయిత్రి స్థాయిలో ఎన్నో రచనలు చేయటమే కాకుండా వంశీ సంస్థకు 55 సంవత్సరాలుగా అధ్యక్షురాలిగా ఉంటూ అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేసిన డా. తెన్నేటి సుధా దేవి చిరస్మరణీయురాలని కొనియాడారు. బలిజేపల్లి లక్ష్మీకాంతం గురించి పరిశోధన చేసి డాక్టరేట్ పొందటమే కాకుండా ఎంఏ తెలుగు లో మాడపాటి హనుమంతరావు స్వర్ణ పతకాన్ని కూడా సుధా దేవి పొందారని, ప్రపంచంలో ఏ భాషలోనూ ఎవరూ రాయని సామెతల ఆధారంగా 500 రేడియో నాటికలను రచించిన ఘనత పొందిన తెలుగు బిడ్డ అని అన్నారు. ఈ కార్యక్రమంలో వంశీ రామరాజు కుటుంబ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

## కూచిపూడి నృత్య ప్రామాణీకరణ విధివిధానాల రూపకల్పన అత్యవసరం

### -ప్రఖ్యాత కూచిపూడి గురువులు

**నాంపల్లి, డిసెంబరు 6 ప్రభాతవార్త :** కూచిపూడి నృత్యాన్ని ప్రామాణీకరించి తెలుగు విశ్వవిద్యాలయ నిర్వహణలో జరిగే పరీక్షా విధివిధానాలకు దిశానిర్దేశం చేయడం అత్యవసరమని పలువు ప్రముఖ కూచిపూడి నృత్యగురువులు అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తు లోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో సిద్ధనాట్య కళాసమితి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం సర్టిఫికెట్ పరీక్ష ప్రథమ, ద్వితీయ సంవత్సరం, డిప్లొమా విద్యార్థులకు సిద్ధాంతం మరియు ప్రాయోగిక అంశాలపై నిర్వహించిన నాట్యశాస్త్ర సమీక్ష సదస్సులో గురువులు కూచిపూడి నృత్యంపై సమీక్షించారు. ఈ సందర్భంగా నృత్యగురువులు డా. భాగవతుల సేతురామ్, డా. పసుమర్తి శేషుబాబు, డా. జొన్నలగడ్డ అనురాధ, డా. కె.అనితారావు, డా. కె.యామిని యశోద, ప్రియాంక వెంపటి, రవిశంకర్ తదితరులు సదస్సులో పాల్గొని



కూచిపూడి నృత్యశాస్త్ర సమీక్షా సదస్సులో పాల్గొన్న నాట్యగురువులు

యువ నృత్యకళాకారిణులకు, గురువులకు కూచిపూడి శాస్త్రం, తాళం, లయ, పాఠ్యాంశాలపై పలు విలువైన సూచనలు అందించారు. సమితి సభ్యులు సుధామాల, రేణుక ప్రభాకర్, అడపా భరణి, నళిని రమణ, ఆర్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొనగా సంస్థ అధ్యక్షురాలు వాణిరమణ స్వాగతోపన్యాసం కావించగా శ్రీలత నారపరాజు వందన సమర్పణతో సదస్సు విజయవంతంగా ముగిసింది. డా. సుమిత్ర పార్థసారథి సమన్వయకర్తగా వ్యవహరించారు.

## సంగీత, సాహిత్య కార్యక్రమాలను ప్రోత్సహించాలి



ప్రసంగిస్తున్న ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్

**చిక్కడపల్లి డిసెంబర్ 6 ప్రభాతవార్త :** సంగీత, సాహిత్య కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ అన్నారు. శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో శ్రీ ధ్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇషాన్ ఫౌండేషన్ , విజయ క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రఖ్యాత గాన గంధర్వుడు, పద్మశ్రీ డాక్టర్ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వాహక సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో 12 గంటల నిరంతర సంగీత కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేకంగా, దేశవ్యాప్తంగా పేరొందిన నిష్ణాతులైన గాయని-గాయకులతో పేరి నాగేశ్వర్ రావు బృందం నిర్వహిస్తున్న సంగీత కార్యక్రమాలు అత్యంత అభినందనీయం అని పేర్కొన్నారు. అలాగే, స్కూల్ పిల్లలకు సహాయం చేయడం, పాఠశాలలకు ఆర్థికంగా తోడ్పాటు అందించడం, ఉప్పల్‌లోని అభయ ఫౌండేషన్ లో గత 18-20 సంవత్సరాలుగా నిరంతరంగా అన్నప్రసాదాన్ని అందించడం వంటి సేవా కార్యక్రమాలను ప్రత్యేకంగా కొనియాడారు. 150 పాటలను 16 మంది గాయకులు తమదైన శైలి, అభిరుచి, శ్రుతి-లయ సమన్వయంతో సుమారు 150 పాటలు ఆలపించారు. ఘంటసాల గారి ప్రతి గీతమూ ఒక నిత్యకావ్యం; వాటిని భావప్రధానంగా పాడటంలో పాల్గొన్న కళాకారుల కృషి ప్రశంసనీయమన్నారు. లయన్స్ క్లబ్ హైదరాబాద్ శతాబ్ది పూర్వ ఉపాధ్యక్షుడు కందాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్‌లో దొంగతనం

**కంటోన్మెంట్, నవంబర్ 6 ప్రభాతవార్తః**

బోయినపల్లి మార్కెట్ యార్డులో శుక్రవారం రాత్రి ఓ వ్యాపారి దుకాణంలో దొంగతనం జరిగింది. మార్కెట్ యార్డులోని వ్యాపారి శంకర్‌కు చెందిన బి56 దుకాణంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. రూ. 2లక్షల 53 వేల రూపాయల నగదు దొంగిలించినట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కొంతమంది రైతులకు డబ్బులు ఉదయం ఇవ్వడానికి దుకాణంలో భద్రపరిచినట్లు బాధితులు తెలిపారు. కాగా మార్కెట్ యార్డ్ లో నిత్యం సెక్యూరిటీ, రైతులు వ్యాపారస్తులు తిరుగుతుంటారు. తిరుమలగిరి పోలీసులు సీసీ పుటేజీ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆయిల్ ట్యాంకర్ ఢీకొని వృద్ధుడు దుర్మరణం

**సరూర్‌నగర్, డిసెంబర్ 6 ప్రభాతవార్త:** రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ గుర్తు తెలియని వృద్ధుడిని అయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం ఉదయం మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం శనివారం ఉదయం 8 గంటల సమయంలో దాదాపు 70 నుండి 80 సంవత్సరాల వయస్సు ఉన్న ఓ వృద్ధుడు మంద మల్లమ్మ చౌరస్తా వద్ద నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియరాలేదు. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న మీర్‌పేట్ పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

## ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు



ప్రత్యేక పూజలందుకుంటున్న శ్రీప్రసన్నాంజనేయస్వామి విగ్రహం

**నర్సాపూర్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని హనుమాన్ ఆలయంలో శనివారం పురస్కరించుకొని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ పూజారి హరిప్రసాద్ శర్మ వేదమంత్రాలతో నవగ్రహపూజ, గణపతిపూజ, శివపూజలతోపాటు శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, చందన లేపనం, హారతీ, భజన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుమ్మరి సంజీవ్, సదానందం, కుమ్మరి జ్ఞానేశ్వర్, పాముల రమేష్, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌పార్టీకి రాజీనామాచేసిన ఉప అధ్యక్షుడు

**-కాంగ్రెస్‌పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కాట శ్రీనివాస్‌గౌడ్**

**గుమ్మడిదల, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మండల బిఆర్ఎస్ పార్టీ ఉప అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామాచేస్తూ కాంగ్రెస్ పార్టీలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యమని గ్రహించి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అందరూ ఒకే గోడుగు కిందికి రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరువు ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, వడ్డే కృష్ణ, కొత్తపల్లి మాజీ తాజా ఉపసర్పంచ్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యసేవలు అందించాలి..

**-జిల్లా వైద్యాధికారి శ్రీరామ్...**

**పాపన్నపేట, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, జిల్లా వైద్య అధికారి శ్రీరామ్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పొడ్చెన్ పల్లి ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ఎక్స్పైర్ అయిన మందులను తొలగించి ఆస్పత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని తెలిపారు. ఆస్పత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఆస్పత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**న్యాల్‌కల్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

సైబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన ఎస్ఐ దోమ సుజిత్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మామిడ్గి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అర్జిస్తున్న విద్యార్థులకు ఎస్ఐ సుజిత్‌దోమ అవగాహన కల్పించారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని, క్రమ శిక్షణతో విద్యను అందుకుంటే భవిష్యత్తు బంగారు మయం కావడం తథ్యమన్నారు. సైబర్ నేరాలకు గురైన బాధితులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఐ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు

## వెల్దుర్తిలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

**ఎంపిడివో ఉమాదేవి**

**వెల్దుర్తి, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన వెల్దుర్తిలోని రైతు వేదికలో శనివారం నాడు స్థానిక ఎంపిడివో ఉమాదేవి ఆధ్వర్యంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఎన్నికల సెక్షన్లో మండల విద్యాధికారి సీతారాం స్థానిక ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య. ఎంపిఓ నవీన్, పంచాయతీ సెక్రెటరీ బలరాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొనాలి

**-రిటైర్డ్ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ సి.గోపాలకృష్ణమూర్తి**

**నర్సాపూర్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

విద్యార్థులు వివిధరకాల పోటీలలోపాల్గొని అనుభవాన్ని పెంపొందించుకోవాలని రిటైర్డ్ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ సి.గోపాలకృష్ణమూర్తి పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ సమీపంలోని వైపర్ కళాశాలలో డాక్టర్ సి గోపాలకృష్ణమూర్తి ఐపిఎ నేషనల్ కాంపిటేషన్ సెమీ ఫైనల్ సౌత్ జోన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోపాలకృష్ణమూర్తి హాజరుకాగా షేర్ ఫార్మా ఫోరం ప్రెసిడెంట్ టివి నారాయణ, పాల్గొన్నారు. ఈ పోటీలలో వివిధ రాష్ట్రాల నుంచి పలువురు విద్యార్థినీవిద్యార్థులు ఎలక్ట్రిషన్‌పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీల కార్యక్రమానికి బివిఆర్ఐటి బేసిక్‌సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ మృణాళిని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇండియా సిడిఎస్‌సిఓ పి. వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ వైపై డాక్టర్ చంద్రయ్యలు జడ్జిలుగా వ్యవహరించారు. పోటీలో గెలిచిన విద్యార్థినీవిద్యార్థులు ఇండియన్ ఫార్మసిటికల్ కాంగ్రెస్‌లో పాల్గొనుటకు అర్హత సాధించినట్లు తెలిపారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఐపిఎ వైపర్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, లోకల్ బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ పి రాజశేఖర్, కార్యనిర్వాహకురాలిగా డాక్టర్ సౌజన్య, అధ్యాక అధ్యాపక బృందం లక్ష్మి సత్య, స్వాతి, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## గుండె పోటుతో మాజీ సర్పంచ్ మృతి

**చౌటకూరు, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన చౌటకూరు గ్రామ మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి జోగిరెడ్డి (70) గుండెపోటుతో మృతిచెందారు. గత 9 రోజుల క్రితం ఇంట్లో ఉండగా జోగిరెడ్డికి ఛాతీలో నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ శనివారం జోగిరెడ్డి మృతిచెందారు. మృతుడు జోగిరెడ్డికి భార్య ఉమ, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. 1986 నుంచి 1991 వరకు గ్రామ సర్పంచ్‌గా సేవలు అందించారు. జోగిరెడ్డి మృతి పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, మాజీ ఎంపిపి అధ్యక్షులు భూంరెడ్డి సుభాష్‌రెడ్డిలు వేరు వేరుగా సంతాపం తెలిపారు. ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు జరుగనున్నాయని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## కొత్తలాపురంలో రైతులకు అవగాహన కార్యక్రమం

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబరు 16, ప్రభాతవార్త:**

వరి అవశేషాల దహనంతో కలిగే ప్రభావాలపై సంగారెడ్డి మండలం కొతలాపూర్గ్ గ్రామంలో శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ హాజరై మాట్లాడారు. స్టబుల్ బర్నింగ్ వల్ల నేలపై, పర్యావరణంపై కలిగే దుష్ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి ఝాన్సీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వర్ధంతి



అంబేద్కర్‌కు నివాళి అర్పించిన ఎమ్మెల్యే అంజిరెడ్డి



అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం



అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు



నివాళి అర్పిస్తున్న మాజీమంత్రి చంద్రశేఖర్



నివాళి అర్పిస్తున్న బిహెచ్ఈఎల్ అధికారులు



నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం



అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కొమ్మూరి



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న టిజేయు నేతలు



అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు



అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న సింధు ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురంలో...**

**రామచంద్రాపురం, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని రామచంద్రాపురంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దళితసంఘం నాయకులు శ్రీనివాస్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

**సిద్దిపేటలో...**

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పాతబస్టాండు అంబేద్కర్ సర్కిల్‌లో కాంగ్రెస్‌నాయకులతో కలిసి ఎం.డి.ఇమామ్(అత్తు) అంబేద్కర్ విగ్రహానికి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీనాయకులు సాకి ఆనంద్, వేణు, మధు, గయాజుద్దీన్, హర్షద్, సంతోష్‌గౌడ్, అజ్జు యాదవ్, మున్నా, సనాబాబా తదితరులు పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో...**

చిన్నకోడూరు మండలకేంద్రంలో అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మల్లేశం, కనకయ్య, మల్లేశం, కనకయ్య, బాలకృష్ణ, కన్నారెడ్డి, అనిల్, శివరామకృష్ణ, రవి, ప్రేమ్‌చంద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

**జహీరాబాద్‌లో...**

**జహీరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

అంబేద్కర్ వర్ధంతిని శనివారం పట్టణంలో బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, యాకూబ్, మోహియుద్దీన్, మిథున్‌రాజ, శివప్ప, బరూర్ దత్తాత్రి, గణేష్, చంద్రయ్య, అలీ, సలీం, వెంకట్, నరసింహారెడ్డి, ఇబ్రహీం, జుబేర్, వెంకట్, సాగర్, లక్ష్మీకాంత్, జాకీర్, మోహన్, ఫయాజ్, రఘుతేజ తదితరులు పాల్గొన్నారు.

**దళిత సంఘాల ఆధ్వర్యంలో...**

అంబేద్కర్ వర్ధంతిని దళిత సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ వ్యవస్థాపక అధ్యక్షులు మొగులయ్య, గౌతం, ఉపాధ్యాయులు రాంచందర్, భీంవంశీ, దన్నూర్ శ్రీనివాస్, కె.బిచ్చయ్య, వరాలు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్‌కు నివాళులు అర్పించిన మాజీ మంత్రి...**

మాజీ మంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కండెం నర్సింలు, నరసింహారెడ్డి, భీమయ్య, ఖాజామియా, నరేష్‌గౌడ్, మోయిస, జనార్ధన్, జమీల్, యూనుస్, రాములు, జయరాజ్, శేఖర్ పాల్గొన్నారు.

**రామచంద్రాపురంలో...**

**రామచంద్రాపురం, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

బిహెచ్ఈఎల్ అధికారులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్లు, డిఆర్ఓఉ, అదికారులు, ఈవెంట్‌కమిటీ సభ్యులు, యూనియన్ నాయకులు, అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ కావలి నగేష్, పీటర్, సామ్రాట్, ఐలాపూర్ ఐలేష్, నవీన్‌గౌడ్, మహిపాల్‌గౌడ్, సంతోష్‌గౌడ్, గారెల శ్రీశైలం, మల్లేష్, రఫీ, నర్సింహాగౌడ్, హన్మంతు, రవిగౌడ్, వెంకటేశ్వరర్లు పాల్గొన్నారు.

**గుమ్మడిదలలో...**

**గుమ్మడిదల, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మున్సిపాలిటీ మండలకేంద్రంలో అంబేద్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రెడ్డిసంఘం మాజీ అధ్యక్షులు జగ్గారెడ్డి బాల్‌రెడ్డి, ముదిరాజ్‌సంఘం మండల అధ్యక్షులు మల్లేష్, అంబేద్కర్‌సంఘ మండల అధ్యక్షులు నీరుడి రమేష్, తుడుం రవి, మాజీ వార్డ్‌సభ్యులు లలిత, ముదిరాజ్‌సంఘం గ్రామ అధ్యక్షులు నాగయ్య మైనార్టీనాయకుడు అయూబ్, ముదిరాజ్‌సంఘం మాజీ అధ్య క్షులు నర్సింలు, బాల్‌రెడ్డి, వీరన్నగూడెం వీరేష్ సంఘం ఉపాధ్యక్షులు డప్పు శ్రీనివాస్, దోమడుగు నాగరాజు, యోగగురువు బిక్షపతిరెడ్డి, నర్సింగ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**పటాన్‌చెరులో...**

**పటాన్‌చెరు, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి గూడెం మధుసూదన్ రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు వెంకటేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

**రామాయంపేటలో...**

**రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

రామాయంపేటలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు టంకరి వెంకటి, యూత్ డైరెక్టర్ గావు సురేందర్, బైరం విన్ను బాబు, కమటం రాము, నాగరాజు, శశి, మహేష్, నరేందర్, నాగ ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

**చేర్యాలలో...**

**చేర్యాల, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

అంబేద్కర్ వర్ధంతిని మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంగడిబజార్‌లోని అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, జనగామ నియోజకవర్గ ఇంచార్జీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు కొమ్ము రవి, పట్టణాధ్యక్షులు దాసరి శ్రీకాంత్, కొమురవెల్లి డైరెక్టర్ వెలగల మల్లేశం, సీనియర్ నాయకులు ఆడెపు చంద్రయ్య, పాల లక్ష్మినారాయణ, రాగుల శ్రీనివాస్‌రెడ్డి, ఆడెపు నరేందర్, దాసరి కళావతి, జహీరొద్దీన్, చింతల మల్లేశం, మల్లిగారి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

**గజ్వేల్‌లో...**

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

అంబేద్కర్ వర్ధంతిని టిజెయు ఆధ్వర్యంలో గజ్వేల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టిజెయు రాష్ట్ర ప్రధానకార్యదర్శి బింగి స్వామి, జిల్లా అధ్యక్షుడు మరాఠి కృష్ణమూర్తి, ఎస్సీ,ఎస్టీ డివిజన్ అధ్యక్షుడు కె.సత్యం, కార్యదర్శి యాదగిరిలు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

**రామాయంపేటలో...**

**రామాయంపేట, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

రామాయంపేట పట్టణంలో దళిత సంఘాలు, రాజకీయ నాయకులు సమక్షంలో అంబేద్కర్‌విగ్రహం దగ్గర నివాళులు అర్పించడం జరిగింది కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్‌నాయకులు పాతూరి రాజ్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్‌నాయకులు, మాదిగ దళితసంఘాల నాయకులు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు శంకర్‌గౌడు, శాంతికుమార్ ఎంఆర్పిఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు మల్యాల కిషన్ మాదిగ, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

**నారాయణఖేడ్‌లో...**

**నారాయణఖేడ్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి రాకేష్ శెట్కార్, పిసిసి సభ్యులు కెశ్రీనివాస్, ఇతరనాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, యూత్‌కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**రామచంద్రాపురంలో...**

**రామచంద్రాపురం, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని ఈఎస్ఐ రోడ్డు, మాక్‌సొసైటి ప్రాంతాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి, నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డివిజన్ కాలనీల సొసైటీ డైరెక్టర్లు, డివిజన్ నాయకులు, బిఆర్ఎస్ నాయకులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

## అక్షర పాఠశాలకు జిల్లాస్థాయి గుర్తింపు

**రామాయంపేట, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

ఈనెల 4, 5 తేదీలలో మెదక్ జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలలో భాగంగా రామాయంపేట పట్టణానికి చెందిన అక్షర స్కూల్ విద్యార్థులు చక్కటి ప్రదర్శనలతో ప్రతిభను కనబరిచారు. (సేంద్రియ వ్యవసాయం సుస్థిర వ్యవసాయం)లో భాగంగా రసాయనాలను వాడకుండా సహజ పద్ధతులతో వ్యవసాయాన్ని ఎలా చేయవచ్చో తెలిపే ప్రదర్శనలను వినూత్న రీతిలో తయారు చేసి జిల్లా స్థాయిలో మొదటి బహుమతిని జిల్లా విద్యాధికారి చేతులమీదుగా బహుమతిని అందుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వి.సురేష్‌రెడ్డి, డైరెక్టర్లు కరుణాకర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, ఉపాధ్యాయినీఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తంచేశారు.

## సామాజిక సమానత్వానికి పాటుపడిన గొప్ప వ్యక్తి అంబేద్కర్

**-కాంగ్రెస్ నాయకులు**

**నర్సాపూర్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

సామాజిక సమానత్వం కోసం తన జీవితాంతం పోరాడిన గొప్ప వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డిలు అన్నారు. శనివారం అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని నర్సాపూర్ పట్టణంలోని చిల్డ్రన్ పార్క్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతేగాక అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షినటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాలమేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పీఠికను చదివి రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నామంటూ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి జ్యోతి సురేష్ నాయక్, నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుర్రాల మల్లేశం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు అజ్మత్, యూత్ కాంగ్రెస్ నాయకుడు సుధీర్ గౌడ్, నాయకులు ఎద్దు మల్లేష్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, రషీద్, రాజశేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లకు 258-వార్డులకు 453 నామినేషన్‌లు

**నాగల్‌గిద్ద, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

ఈ నెల 17న జరుగనున్న 3వ విడత పంచాయితీ ఎన్నికలను పురస్కరించుకుని మూడు రోజుల పాటు కొనసాగిన నామినేషన్‌ల ప్రక్రియలో 33 పంచాయతీ సర్పంచ్‌లకు 258 మంది, 258 వార్డులకు 453 మంది వార్డు సభ్యులుగా నామినేషన్‌లు దాఖలు చేసినట్లు మండల అభివృద్ధి అధికారి తెలిపారు. ఇదిలా ఉండగా ఈ నెల 9న 9వ తారీఖున నామినేషన్‌ల ఉపసంహరణకు అధికారులు అవకాశం కల్పించారు. అయితే మండలంలోని 5 తండా పంచాయతీలలో సర్పంచ్ పదవులకు ఏకగ్రీవంగా తీర్మాణం చేసుకున్నట్లు సమాచారం. నామినేషన్‌ల ఉపసంహరణ పూర్తయ్యాక ఏకగ్రీవ సర్పంచ్ స్థానాలను ఎన్నికల అధికారులు ప్రకటించే అవకాశం ఉంది.

## చర్లపల్లి గ్రామపంచాయతీ స్వతంత్ర అభ్యర్థి లంబాడి అరుణ ఏకగ్రీవం

**వెల్దుర్తి, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

మండలంలోని చర్లపల్లి గ్రామపంచాయతీ నుండి స్వతంత్ర అభ్యర్థిగా ఎస్టీ రిజర్వ్ మహిళా కావడంతో లంబడి అరుణ ఒకే నామినేషన్ వేశారు. దీంతో గ్రామస్తులు శనివారం చర్లపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ను ఏకగ్రీవంగా ఎన్నుకొని తీర్మానించారు. గ్రామ సర్పంచ్‌గా లంబాడి అరుణ, ఉపసర్పంచ్‌గా గోదల పెంటారెడ్డిని ప్రజలు ఎన్నుకోవడం జరిగిందన్నారు. కాగా వార్డు మెంబర్లుగా వల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, వల్లూరి అనురాధ, కలాం అనసూయ, కరుల ప్రభాకర్, బాకీ లక్ష్మి, లంబాడి రాజు, లంబాడి హంసలను చర్లపల్లి గ్రామప్రజలతోపాటు మాజీసర్పంచ్ పోతుల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు.

## 22 పంచాయితీలకు 64 నామినేషన్‌లు

**-21వార్డులకు 466 నామినేషన్లు**

**జహీరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

ఈ నెల 14న జరుగనున్న రెండవ విడత పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీలకు 64 నామినేషన్లు, 210 వార్డులకు 466 నామినేషన్లు దాఖలయినట్లు మండల అభివృద్ధి అధికారి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికలబరిలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించామన్నారు. డిసెంబరు 14న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, అదే రోజు మధ్యాహ్నం ఓట్లను లెక్కించి ఫలితాలు ప్రకటిస్తామన్నారు.

## ఏకగ్రీవం దిశగా 9 వార్డులు

**మనూర్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

ఈ నెల 17వ తారీఖున జరుగున్న 3వ విడత పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని 9 వార్డులు ఏకగ్రీవం కానున్నట్లు తెలుస్తోంది. మండల పరిధిలోని బెల్లాపూర్ పంచాయతీలో 10వార్డులు ఉండగా 8 వార్డులకు ఒకటే నామినేషన్, ముగ్దంపూర్‌లో 6 వార్డు స్థానాలకు 10 నామినేషన్‌లు దాఖలు కాగా ఒక వార్డుకు ఒకటే నామినేషన్ వచ్చినట్లు తెలుస్తోంది. మండలంలోని 22 పంచాయతీలకు 142 నామినేషన్‌లు రాగా ఒక నామినేషన్‌ను అధికారులు తిరస్కరించడంతో 141 నామినేషన్‌లు బరిలో ఉన్నాయి. 184 వార్డులకు 398 నామినేషన్‌లు వచ్చినట్లు ఎంపిడిఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు.


## నర్సాపూర్ అభివృద్ధికి ఓటెయ్యండి

**నారాయణఖేడ్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ మండల పరిధిలోని నర్సాపూర్ అభివృద్ధికి ఓటెయ్యాలని కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి చాకలి సరోజన అంజి అన్నారు. శనివారం ఆమె గ్రామస్థులతో మాట్లాడుతూ తనకు ఓటు వేసి గెలిపిస్తే కాంగ్రెస్ పెద్దల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని చెప్పారు. గ్రామంలో గత సర్పంచులు చేసిన అభివృద్ధిని చూసి ప్రస్తుతం తనకు అవకాశం ఇయ్యాలని చెప్పారు.

## నర్సాపూర్‌లోని అయ్యప్పస్వామి ఆలయం తెలంగాణాలో 2వ శబరిమల

**-ఎమ్మెల్యే సునీతారెడ్డి**



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, అయ్యప్పస్వాములు

**నర్సాపూర్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

నర్సాపూర్‌లో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయం తెలంగాణలో రెండవ శబరిమలగా ప్రసిద్ధక్షేత్రంగా వెలుగొందుతుంది ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదిపరాశక్తి వనగిరి ధర్మశాస్త్ర అయ్యప్పస్వామిని ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకున్నారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో వెలసిన అయ్యప్పస్వామిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే సునీతారెడ్డి అయ్యప్ప స్వాములతో కలిసి అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్‌గౌడ్‌స్వామి, రాములుగుప్తా, శంకర్, శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌గౌడ్, గోపిగౌడ్ అయ్యప్ప దీక్షస్వాములతోపాటు టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పంబల బిక్షపతి, నాయకులు సత్యంగౌడ్, రింగులప్రసాద్, ఆంజనేయులుగౌడ్, ఆలయకమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

బిసి,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలు ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు పి. నర్సింగరావు అన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కారణంగా మరణించిన సాయిఈశ్వరచారి చిత్రపటానికి శనివారం గజ్వేల్‌లో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు తెలంగాణ ఉద్యమం చేసి అమరులైన బిసి,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ బిడ్డలు తెలంగాణ రాష్ట్ర విభజన కోసం, ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటం చేయడం జరిగిందన్నారు. నేడు బిసి రిజర్వేషన్ల కోసం సాయి ఈశ్వరచారి మరణించినట్లు తెలిపారు. బిసిలు అంతా ఏకమై రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా తెలంగాణ రాజ్యాధికారి పార్టీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ బాబా, గాలెంక స్వామి, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు 194, వార్డులకు 703 నామినేషన్‌లు



సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న విజయలక్ష్మి

**న్యాల్‌కల్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని 38 గ్రామ పంచాయతీలకు ఈ నెల 17వ తారీఖున జరుగనున్న 3వ విడత పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని మూడు రోజుల పాటు కొనసాగిన నామినేషన్‌ల ప్రక్రియలో సర్పంచ్ స్థానాలకు 194 నామినేషన్‌లు, 332 వార్డులకు 703 నామినేషన్‌లు దాఖలయినట్లు మండల అభివృద్ధి అధికారి షాగుప్త ఇఫ్ఫాత్ పేర్కొన్నారు. అందిన నామినేషన్‌లను పరిశీలించి తిరస్కరణకు గురైన నామినేషన్‌ల వివరాలు వెల్లడిస్తామన్నారు. ఈనెల9న నామినేషన్‌ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని, నామినేషన్‌ల ఉపసంహరణ ముగిసాక పంచాయతీ బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు బహిర్గతం అవుతాయని ఎంపిడిఓ పేర్కొన్నారు.

## సర్పంచ్‌లకు 140, వార్డులకు 410 నామినేషన్‌లు

**సిర్గాపూర్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు ఈనెల 17న జరుగనున్న 3వ విడత పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని శుక్రవారంతో నామినేషన్ల దాఖలు పర్వం ముగిసింది. 28 పంచాయతీలకు 140 నామినేషన్‌లు, 226 వార్డులకు 410 నామినేషన్లు దాఖలయినట్లు మండల అభివృద్ధి అధికారిణి శారదాదేవి పేర్కొన్నారు. ఈనెల 9 నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుందని, ఉపసంహరణ ముగిసాక పంచాయతీ బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు వివరిస్తామన్నారు.

## సర్పంచ్‌లకు 140, వార్డులకు 400 నామినేషన్లు



సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేస్తున్న కె.రేషదిగంబర్‌రెడ్డి

**మనూర్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
ఈనెల 17న జరుగనున్న మూడవవిడత పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు మూడురోజులపాటు కొనసాగిన నామినేషన్ ప్రక్రియలో 22 పంచాయతీలకు 140మంది, 184 వార్డులకు 4వందల నామినేషన్లు దాఖలయినట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ తెలిపారు. దాఖలయిన నామినేషన్‌లను పరిశీలించి బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తామని, ఈనెల 9న నామినేషన్‌ల ఉపసంహకరణకు అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం పంచాయతీ బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు తెలుస్తాయి.

## హుషారుగా దక్షిణభారత విద్యాపర్యటన



వ్యవసాయ యూనివర్సిటీని సందర్శించిన ఇంజనీరింగ్ విద్యార్థులు

**కంది, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కందిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు చేపడుతున్న 10 రోజుల దక్షిణభారత విద్యాపర్యటన హుషారుగా సాగుతోంది. విద్యాపర్యటనలో భాగంగా మూడవ, నాలుగవ రోజైన శుక్ర, శనివారల్లో కోయంబత్తూర్, కేరళ రాష్ట్రాల్లోని తమిళనాడు అగ్రికల్చరల్ యూనివర్సిటీని (టిఎన్ఎయు)ను, పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజీ కేంద్రాలను సందర్శించారు. పంటకోత అనంతరం నష్టాలను తగ్గించే సాంకేతికత, నిల్వపద్దతులు, విలువ వృద్ధి ప్రాసెసింగ్, ఆధునిక యంత్రాల పనితీరుపై శాస్త్రవేత్తలు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

**కేరళలో వ్యవసాయ విశ్వవిద్యాలయం సందర్శన...**
కేరళ రాష్ట్రంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని విద్యార్థులు శనివారం సందర్శించి వ్యవసాయ బిజినెస్ ఇన్‌క్యుబేటర్ విభాగాన్ని సందర్శించారు. డాక్టర్ అమ్ము దనకరణ, డాక్టర్ ఆఫ్తాబ్ నయీద్‌లు విద్యార్థులకు వ్యవసాయ బిజినెస్ ఇన్క్యుబేషన్ కేంద్రం విధులు, స్టార్టప్‌లకు అందించే సాంకేతిక ఆర్థిక సహాయం, ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు, అగ్రి ఫుడ్ టెక్నాలజీ రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణల గురించి వివరించారు.

## అండర్-16 గర్ల్స్ వాలీబాల్ టోర్నమెంట్



అండర్-16 బాలికల వాలీబాల్ టీమ్

**గుమ్మడిదల, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
హైదరాబాద్-బిహెచ్‌ఈఎల్ సహోదయ స్కూళ్ల క్లస్టర్ ఆధ్వర్యంలో డిసెంబ్రు 6, 2025న శ్రీవివేకానంద హైస్కూల్, గుమ్మడిదలలో అండర్-16 బాలికల వాలీబాల్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించబడింది. ఈ పోటీల్లో శ్రీవివేకానంద హైస్కూల్, సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్, వికాస్ కాన్సెప్ట్‌స్కూల్, కార్నర్‌స్టోన్ స్కూల్, జ్యోతివిద్యాలయ హైస్కూల్, భారతీయవిద్యాభవన్, సెంటియా ది గ్లోబల్ స్కూల్ వంటి ప్రముఖ విద్యా సంస్థల నుండి ప్రతిభావంతులైన విద్యార్థినులు పాల్గొని తమ ప్రతిభ, సామూహిక భావన, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. ఫలితాల విజేత సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్, బాచుపల్లి, రన్నరప్ భారతీయ విద్యాభవన్ బిహెచ్‌ఈఎల్, విజేతలుగా నిలిచాయి. టోర్నమెంట్ విజయవంతంగా పూర్తికావడానికి సహకరించిన అన్ని పాఠశాలలకు, బోధనాసిబ్బందికి, అలాగే పిఈటిలు రమేష్, మధు, పూజిత, శ్రీకాంత్, అశోక్, మోహన్, వెంకట్, కె.అశోక్ శ్రీవివేకానంద హైస్కూల్ వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లత జైపాల్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

## మైనింగ్ అధికారులను అడ్డుకున్న రైతులు

**పటాన్‌చెరు, డిసెంబరు 4 ప్రభాతవార్త**
జిన్నారం మున్సిపల్ పరిధిలోని ఊట్ల దాదిగూడెం శివారిలో రాళ్లకత్వ దాదిగూడెం రైతులు సర్వే నెంబర్ 829 కోసం వచ్చిన సంగారెడ్డి జిల్లా మైనింగ్ అధికారులను అడ్డుకున్నారు. రైతులు ముందస్తు సమాచారం లేకుండా సర్వే ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. అక్రమంగా క్రషర్లకు అనుమతులు ఇవ్వడానికే అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రైతులకు అన్యాయం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

# స్వామివారి కళ్యాణం అంగరంగవైభవంగా నిర్వహించాలి

**-అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలి**
**-జిల్లా కలెక్టర్ కె.హైమావతి**



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**కొమురవెల్లి, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణం ఈనెల 14న జరగనుండడంతో కళ్యాణ ఏర్పాట్లు, కళ్యాణం నుంచి మొదలుకొని వచ్చే ఉగాదివరకు జరిగే జాతర ముందస్తు ఏర్పాట్లను శనివారం జిల్లాకలెక్టర్ కె.హైమావతి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్వామివారి కళ్యాణం జరిగే తోటబావి ప్రాంతంలో చుట్టూ బారికేడ్లు, విఐపిగ్యాలరీ, మీడియాగ్యాలరీ, సామాన్యభక్తులు తిలకించేలా తగిన ఏర్పాట్లుచేయాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించడానికి తీర్చిదిద్దాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వాహనాల పార్కింగ్, భక్తులకు సరిపోయేలా స్నానపుగదులు, మరుగుదొడ్లు, నిర్మించడానికి ప్రతిపాదనలు త్వరగా పంపించి, నిర్మాణంచేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎక్కడా చెత్తా చెదారంలేకుండా పారిశుధ్యపనులు నిర్వహించాలన్నారు. పారిశుధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షణ చేయడానికి సూపర్‌వైజర్‌లను పెట్టాలని ఎంపిడివోను ఆదేశించారు. బస్టాండులో చెత్తాచెదారంలేకుండాచూడాలని ఆర్టీసి అధికారులకు సూచించారు. గుట్టపైన కొత్తగా నిర్మాణంలో ఉన్న అతిథి గృహాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఆయాశాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఆలయ ఈవో వెంకటేశం, పిఆర్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, అర్అండ్‌బి అధికారులు, తహసీల్దార్, ఎంపిడివో తదితరులు ఉన్నారు.

## కేంద్రమంత్రిని కలిసిన బిజెపి నాయకులు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని మండలంలోని పంచాయతీ ఎన్నికల సర్పంచ్, వార్డుసభ్యులు అభ్యర్థులు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. త్వరలోనే కొమురవెల్లి మల్లికార్జున్‌స్వామి రైల్వే స్టేషన్ పనులను కేంద్రమంత్రికి వివరించారు. జాతరసమయంలో మూడు నెలలపాటు భక్తులకు, వ్యాపారవర్గాలకు మొబైల్ కమ్యూనికేషన్ వ్యవస్థతో తీవ్ర ఇబ్బందులు వస్తాయని వివరించారు. వెంటనే కేంద్రమంత్రి స్పందించి మొబైల్ అపరేటర్లకు మెరుగైన కమ్యూనికేషన్ కొమురవెల్లిలో ఉండేలా ఆపరేటర్లకు ఆదేశాలు జారీచేసి మొదటివారం జాతరసమయానికి మెరుగైన కమ్యూనికేషన్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షురాలు బూర్గోజు స్వరూప, కార్యదర్శి ఎక్కల్‌దేవి శ్రీనివాస్, నాయకులు ఎక్కల్‌దేవి మధు, బూర్గోజు నాగరాజు, పాశం భరత్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

**-నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**పెద్దశంకరంపేట, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండలపరిధిలోని జూకల్, ఉత్తులూర్, మల్కాపూర్ తదితరగ్రామాలలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పర్యటించి కాంగ్రెస్‌పార్టీ బలపర్చిన అభ్యర్థులను పంచాయతీ ఎన్నికలలో భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. జూకల్లో బిఆర్ఎస్‌పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేసమక్షంలో పార్టీలోచేరారు. ప్రజాసమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని, ప్రజలు కాంగ్రెస్‌పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమపథకాలను ఆదరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, మధు, నారాగౌడ్, ఆయా అభ్యర్థులు, పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల సాగు లాభదాయకం

**-పంట మార్పిడితో అధిక ఆదాయం**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబరు 6, ప్రభతవార్త:**
జిల్లాలోని పుల్కల్ కోహీర్ జహీరాబాద్ మండలాల్లోని పలు గ్రామాలలో సాగు చేస్తున్న మామిడి తోటలను సంగారెడ్డి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సోమేశ్వరరావు శనివారం పరిశీలించారు. సీజన్ ప్రారంభమవుతుంది కనుక మామిడి తోటల్లో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులతో పాటు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మొక్కలను ఉత్తేజ పరిచి తొందరగా పూత తెప్పించడానికి డిసెంబరు 15 నుండి 20ల మధ్యలో నీటి వసతి ఉన్న తోటల్లో పాదుల్లో తేలికపాటి తడి ఇవ్వడం లేదా లీటర్ నీటికి పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, యూరియా 5 గ్రాముల చొప్పున కలిపి చెట్టుపై పిచికారి చేయడం వల్ల పూమొగ్గలు దాదాపు ఒకేసారి చిగురించి పూత త్వరగా వచ్చేలా చేయవచ్చున్నారు. పండ్లు, కూరగాయలు, పూల తోటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు నూతన సాగు విధానాలు ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, పందిరిపై తీగజాతి కూరగాయల సాగు మొదలైన పద్ధతులు పాటించాలని ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సోమేశ్వరరావు అన్నారు.

## కొనుగోలుకేంద్రాన్ని సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

**వర్గల్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మైలారం గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ శనివారం సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలుకేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. అలాగే ధాన్యాన్ని వెంటవెంటనే ట్యాగింగ్ చేయాలన్నారు. వారితోపాటు తహసీల్దార్ రఘువీరారెడ్డి, పిఎసిఎస్ సిఈవో జితేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

**-హుస్నాబాద్ ఏసిపి సౌదారపు సదానందం**



కట్కూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ దృశ్యం

**హుస్నాబాద్ రూరల్/ అక్కన్నపేట, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
స్థానిక ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హుస్నాబాద్ ఏసిపి సౌదారపు సదానందం అన్నారు. శనివారంరోజు అక్కన్నపేట మండలంలోని కట్కూర్ గ్రామంలో పోలీస్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో ప్రజలకు పూర్తిభరోసా కల్పించడానికి ఈఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రజలు నిర్భయంగా పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం హుస్నాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలని, ఓటు వినియోగించుకునేందుకు ఎలాంటి ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడవద్దన్నారు. ఎవరైన ఎన్నికల ప్రచారంలో ర్యాలీలు, బహిరంగసభలు నిర్వహించాలంటే తప్పనిసరిగా తహసీల్దార్, పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తే వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం చట్టపరమైన కఠినచర్యలు ఉంటాయన్నారు. గ్రామాలలో ఎలాంటి ఫిర్యాదులు, అనుమానాలు ఉన్నా తక్షణమే నంబర్ 8712667354, 100, 112 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అక్కన్నపేట ఎస్ఐ చాతరాజు ప్రశాంత్‌తో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మినిమల్లీ ఇన్వేసివ్ పద్ధతిలో బైపాస్ శస్త్రచికిత్స

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 6, ప్రభాతవార్త :**
60యేళ్ల గుండె రోగి సింగిరెడ్డి నరసింహారెడ్డికి మినిమల్లీ ఇన్వేసివ్ పద్ధతిలో బైపాస్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు యశోద హాస్పిటల్ సివిటిఎస్ సర్జన్, కార్డియాలజిస్ట్ డాక్టర్ విశాల్‌ఖానాటే తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తేలికపాటి గుండెపోటు వచ్చిన అనంతరం నరసింహారెడ్డి సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో యాంజియోగ్రఫీ పరీక్ష చేయించుకోగా, గుండె రక్తనాళాల్లో అండకులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. బాధితుడు యశోద ఆసుపత్రికి రాగా, రెండు నుంచి మూడు చిన్న కోతలతో ఆధునిక శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఆధునిక శస్త్రచికిత్స ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని డాక్టర్ విశాల్‌ఖానాటే అన్నారు.

# ఆధునిక వసతులతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

**-రూ.35 లక్షలతో ఏర్పాటుచేసిన నూతన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం**
**-ల్యాబ్‌ను ప్రారంభించిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దృశ్యం

**పటాన్‌చెరు, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో విద్యార్థులకు పారిశ్రామికరంగంలో ఉపాధి అవకాశాలు లభించాలన్న సమున్నతలక్ష్యంతో దశాబ్దకాలంపాటు కృషి చేసి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో జెకె ఫెన్నార్, కిర్బీ పరిశ్రమలసౌజన్యంతో రూ.35లక్షల ఏర్పాటు చేసిన నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల ప్రారంభమైన మొదటి సంవత్సరంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా డిగ్రీ కళాశాలలో క్లాస్‌రూమ్‌లు ఏర్పాటుచేయడంతోపాటు కంప్యూటర్‌ల్యాబ్ సైతం అందుబాటులోకి తీసుకొనిరావడం జరిగిందన్నారు. తల్లిదండ్రుల ఆశలు వమ్ముచేయకుండా ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించి పటాన్‌చెరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రాష్ట్ర, జాతీయస్థాయిలో మంచిపేరు తీసుకుని రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కంప్యూటర్ ల్యాబ్ కోసం రూ.35లక్షల సిఎస్ఆర్ నిధులు కేటాయించిన జెకె ఫెన్నార్, కిర్బీ పరిశ్రమ యాజమాన్యాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. అత్యంత నిరుపేద కుటుంబంలో నుండి వచ్చిన తమకు కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సౌకర్యాలు అందించడంపట్ల ఎమ్మెల్యేకు ప్రత్యేకకృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిఐ వినాయక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, జెకె విన్నర్ పరిశ్రమ, సిఎస్ఆర్ ప్రతినిధి సర్వేష్ అమృత్, కిర్బీ హెచ్ఆర్ ప్రతినిధి నాగరాజు, కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బలిదానాలు వద్దు...బరిగీసి కొట్లాడుదాం

**-స్వర్ణకార సంఘం జిల్లా కన్వీనర్, కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం**



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంతచారి, తాజా బిసి ఉద్యమంలో సాయి ఈశ్వర్‌చారి ఆత్మబలిదానాలు విశ్వబ్రాహ్మణ సమాజానికి తీరనిదు:ఖాన్ని మిగుల్చాయని స్వర్ణకార సంఘం జిల్లా కన్వీనర్, మున్సిపల్ కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం ఆవేదన వ్యక్తంచేశారు. సాయి ఈశ్వర్‌చారి ఆత్మబలిదానానికి సంతాపంగా శనివారం జిల్లాకేంద్రంలోని సిద్దిపేటలో విశ్వబ్రాహ్మణసంఘం, స్వర్ణకారసంఘం నాయకులు కొవ్వొత్తులర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిదానాలు వద్దు.. బరిగీసి కొట్లాడుదామన్నారు. బిసిల న్యాయమైన డిమాండ్‌కు కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో తటోజు బ్రహ్మం, గాలయ్య, జగత్‌చారి, అచ్చుల రాజు, సూర్యం, నారోజు రత్నం, అనంతోజు నరసింహచారి, అనంతోజు నాగరాచారి, దయాకరచారి, కల్లెపెల్లి మహేష్, పవన్, మోహన్, నరేందర్, సూర్యప్రకాష్, మణికంఠ, స్వర్ణకారసంఘం ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటించాలి...

**పెద్దశంకరంపేట, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని మండల ఎన్నికల ప్రత్యేక అధికారి తుకారాం అన్నారు. శనివారం స్థానిక రైతువేదికలో ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు ఖర్చులవివరాలను తప్పకుండా అందజేయాలని, వాహనాలప్రచారానికి అనుమతులు తీసుకోవాలని ఆయన సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ షాకీర్‌అలీ తదితరులున్నారు.

## ఘనంగా శ్రీసరస్వతీమాత ఆలయ వార్షికోత్సవం



చండీయాగం నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని తడకపల్లి శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో శనివారం శ్రీసరస్వతీ ఆరామక్షేత్రంలో కొలువైనటువంటి శ్రీసరస్వతీమాత ఆలయ 29వ వార్షికోత్సవ ఘనంగా నిర్వహించారు. చండీయాగం, ఆధ్యాత్మికమహోత్సాహంతో వార్షిక ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో శ్రీసరస్వతీ విద్యాపీఠం జిల్లా అధ్యక్షులు తడకమడ్ల ఈశ్వరయ్య, కార్యదర్శి సాంబశివరావు, పాఠశాల అధ్యక్షులు కొమురవెల్లి శేఖరం, పాఠశాల సహకార్యదర్శి మాంకాల లింగమూర్తి, డాక్టర్ జగదీశ్ విద్యుత్ డిఈ రాంచద్రం పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**-సహాయ జిల్లా ఎన్నికల అధికారి బి.విక్రమ్**

**మర్కుక్, డిసెంబరు 6 (ప్రభాతవార్త):**
రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండలకేంద్రమైన మర్కుక్ రైతు వేదికలో శనివారం ఎంపిడివో, సహాయక జిల్లా ఎన్నికల అధికారి బి.విక్రమ్ అధ్యక్షతన పివోలకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిబంధనల ప్రకారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. బ్యాలెట్ పేపర్ల నిర్వహణ, పోలింగ్ విధి నిర్వహణ, ఓటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓట్ల లెక్కింపు విధానం, ఎన్నికల నిబంధనలు తదితర అంశాలపై అధికారులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో పలు మండలాల ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## అనుమతిలేకుండా ర్యాలీలునిర్వహిస్తే కేసులు తప్పవు

**-ఎస్ఐ దామోదర్**

**మర్కుక్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా అనుమతి లేకుండా ఎవరైనా ర్యాలీలు నిర్వహిస్తే కేసులు తప్పవని మర్కుక్ ఎస్ఐ దామోదర్ హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని పాతూరులో ఎన్నికల ప్రచారంలో భాగంగా కొంత మంది అభ్యర్థులు అనుమతి లేకుండా ప్రచార ర్యాలీ నిర్వహించగా ఇది గమనించిన ఫ్లయింగ్ స్క్వాడ్ టీం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక ఎస్ఐ దామోదర్ అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించిన అభ్యర్థులపై కేసు నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం తప్పనిసరిగా అనుమతి పొందిన తర్వాతనే ర్యాలీలు కానీ, సభలు కానీ నిర్వహించుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## డిగ్రీ కళాశాలను సందర్శించిన కాగ్నిజెంట్ సంస్థ ప్రతినిధులు

**వర్గల్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన వర్గల్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలను శనివారం కాగ్నిజెంట్ సంస్థ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో తృతీయసంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ అనే అంశంపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణా తరగతులు విద్యార్థులకు పది శనివారాల పాటు నిర్వహించడం జరుగుతుందని కాగ్నిజెంట్ బృందం సభ్యురాలు సెలీన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం భాస్కర్ రావు, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాధ, ప్లేస్మెంట్ మెంబర్ బి.అనిత, ఎటిపి వర్షిని దేదీప్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 4 పంచాయతీలు, 30 వార్డులు ఏకగ్రీవం

**పుల్‌కల్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని 4 గ్రామ పంచాయితీలు, 30వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. సర్పంచ్, వార్డు సభ్యులు తాము పోటీ చేసేందుకు వేసిన నామినేషన్‌లను పలువురు శనివారం ఉపసంహంచుకోవడంతో ఒకటే నామినేషన్ మిగిలిఉండటంతో ఏకగ్రీవంగా అధికారులు ప్రకటించారు. మండలపరిధిలోని లక్ష్మీసాగర్ సర్పంచ్‌తో పాటు 8 వార్డులు, లాల్‌సింగ్ నాయక్ తండా సర్పంచ్ పదవితో పాటు 8 వార్డులు, మిన్‌పూర్ తండా సర్పంచ్ పదవితో పాటు 6 వార్డులు, రాయిపాహడ్ సర్పంచ్ పదవితో పాటు 8 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. లక్ష్మీసాగర్ సర్పంచ్‌గా ఉప్పరి లక్ష్మణ్, లాల్‌సింగ్‌నాయక్ తండా సర్పంచ్‌గా రమావత్ లక్ష్మీబాయ్, మిన్‌పూర్‌తండా సర్పంచ్‌గా రమావత్ యమున శంకర్‌నాయక్, రాయిపహడ్ సర్పంచ్‌గా మేతర లక్ష్మీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**చౌటకూరు మండలంలో...**
చౌటకూరు మండల పరిధిలోని సరాఫ్‌పల్లి పంచాయతీ సర్పంచ్ పదవితోపాటు మూడు వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. కాంగ్రెస్ నాయకులు నందికంది రామచంద్రారెడ్డి ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. పంచాయతీలో 8 వార్డులు ఉండగా 3,5,8 వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన వార్డులకు అభ్యర్థులు పోటీలో ఉన్నారు.